క్లుప్తంగా

వసతి గృహాల్లో విద్యార్థులకు టీబీ పరీక్షలు



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యసిబ్బంది

శిరివెళ్ల: కస్తూరిబా పాఠశాల వసతి గృహంలో మంగళవారం విద్యార్థులకు డాక్టర్ ముఖేష్ కుమార్ టీబీ పరీక్షలు నిర్వహించారు. వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వ్యాధి నిర్ధారణ అయిన వారికి వైద్యశాలలో ఉచితంగా మందులు ఇస్తున్నామన్నారు. 2030వ సంవత్సరం నాటికి ఇండియాలో టీబీని పూర్తిగా నిర్మూలించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాంమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతి, వైద్య సిబ్బంది, టీచర్లు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

ఉయ్యాలవాడ : నూతన ఎన్నికల నిబంధనలు, యాప్‌పై బీఎల్‌ఓలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ సువర్ణాదేవి సూచించారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల నిబంధనలపై బీఎల్‌ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఎల్‌ఓలు ఇంటింటా తిరిగి కుటుంబంలో 18 నుంచి 21 సంవత్సరాలు కలిగి ఉండి ఓటు హక్కు లేని వారిని గుర్తించి ఫారం–6 ద్వారా ఓటరుగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు, ఆర్‌ఐ అంకన్న, తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా తప్పని సరి

దొర్నిపాడు: ప్రస్తుతం ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు తప్పని సరిగా రైతులు పంట బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రమీల తెలిపారు. మంగళవారం రామచంద్రాపురం, బుర్రారెడ్డిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. దీంతో ప్రకృతి వైపరీత్యాలవల్ల పంట నష్టం జరిగితే పరిహారం పొందవచ్చన్నారు. కౌలుకార్డు ఉంటే కౌలురైతులు కూడా అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులన్నారు. భూసారా పరీక్షల ఆధారంగా రసాయన ఎరువులను వినియోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు ఈ–పంట నమోదు చేసుకోవాలని సూచించారు. నానో యూరియా, నానో డీఏపీల వాడకం, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు.

భార్యను కడతేర్చిన భర్త



మృతి చెందిన కవిత

నంద్యాల(అర్బన్): అనుమానంతో ఓ వ్యక్తి భార్యను కడతేర్చాడు. నంద్యాల మండలం అబాండం తండా గ్రామంలో మంగళవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అబాండం తండాకు చెందిన శివకృష్ణ, కవితలకు 15ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు సంతానం. శివకృష్ణ కారు డ్రైవర్‌గా వెళుతుండగా కవిత కుండలు విక్రయిస్తుంది. అయితే, భార్య ప్రవర్తనపై కొంత కాలంగా అనుమానంతో ఉన్న శివకృష్ణకు మంగళవారం పెద్దకొట్టాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో ఇంట్లో సన్నిహితంగా ఉండటాన్ని చూశాడు. ఆగ్రహంతో ఇరువురిపై కర్రతో దాడి చేశాడు. కవిత పక్కన ఉన్న వ్యక్తి తప్పించుకోపోగా దాడిలో గాయపడిన ఆమె కుప్పకూలిపోయింది. బంధువులు ఆమెను నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బెండ పంట పరిశీలన

ఉయ్యాలవాడ : పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని సర్వాయిపల్లె గ్రామంలో మంగళవారం రైతులతో కలిసి వ్యవసాయాధికారులు బెండ పంటను పరిశీలించారు. పంటలో తెల్లదోమ ఆశించిందని గుర్తించారు. నివారణకు డైఫెన్ థియురాన్, ఇమిడాకోప్రిడ్ 5 ఎంఎల్ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులురెడ్డి సూచించారు. అలాగే పంటలో కట్టెల పాతి ఎకరాకు 20 చొప్పున పసుపు జిగురు అట్టలు అతికించాలన్నారు. చీడ పీడ నివారణకు రైతులు సమీప రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులకు సంప్రదించి సూచనలు పొందాలన్నారు.

భక్తిశ్రద్ధలతో జియారత్



పీర్లకు ఫాతెహాలు సమర్పిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో జియారత్ వేడుకలను నిర్వహించారు. కులమతాలకు అతీతంగా దస్తగిరి స్వామికి చక్కెర, పులగం, పానకం చదివించి మొక్కులు చెల్లించారు. అలాగే చిన్నారుల కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

‘మిర్చి’ని మింగేస్తున్న తెగుళ్లు!

- ఆళ్లగడ్డ నియోజకవర్గంలో భారీగా మిరప సాగు
- మునుపెన్నడు లేనివిధంగా చుట్టుముట్టిన తెగుళ్లు
- 50 శాతం పంటలపై తీవ్ర ప్రభావం
- ఆందోళనలో అన్నదాతలు

అప్పుడప్పుడూ ఊరించే ధరలు.. అది చూసి పెరిగే విస్తీర్ణం..ఆ తర్వాత వెంటాడే తెగుళ్లు.. పడిపోయే దిగుబడులు..ధరలు ఇది మిరప సాగులో చాన్నాళ్లుగా ఎదురవుతున్న పరిస్థితి. అప్పుల ఊబిలో నుంచి బయటపడేందుకు మిరప సాగును నమ్ముకున్న రైతులకు ఏటికేడు నష్టాల ‘ఘాటు’ తప్పడం లేదు. జిల్లాలో మిరప సాగులో అగ్రస్థానంలో ఉన్న ఆళ్లగడ్డ సబ్‌డివిజన్‌లో ఎవరినీ కదిలించినా రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల మధ్య అప్పులయ్యాయనే ఆవేదనే. ఒక ఏడాది ధర బాగుంటే.. తెగుళ్లు వెంటాడుతున్నాయి. మరో ఏడాది దిగుబడి బాగుంటే ధరలో కోత పడుతోంది. ఎటొచ్చీ చివరకు మిర్చి రైతులకు నష్టాలే మిగులుతున్నాయి.



రుద్రవరం సమీపంలో తెగుళ్లతో ఎదుగుదలలేని మిరప పంట



అరకొర వచ్చిన మిరప కాయలను ఆటోలో తరలిస్తున్న రైతులు

ఆళ్లగడ్డ: నియోజకవర్గంలో పచ్చి మిరప రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. గత ఏడాది ధర పర్వాలేదనిపించింది. ఈ ఏడాది మాత్రం రైతులను కన్నీట ముంచేలా ఉంది. పోయిన సంవత్సరం ధరలు, దిగుబడులు కొంత ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో నష్టపోమనే భావనతో అన్నదాతలు ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెంచారు. పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉంటున్నాయి. ఇంకా మార్కెట్‌కు చేర్చకముందే చేదు అనుభవాలు ఎదరవుతున్నాయి. ఓ వైపు వరుణ దేవుడు కనుకరించక పోవడంతో బెట్టపోతున్నాయి.. మరో వైపు పంటను తెగుళ్లు, వైరస్ చుట్టుముట్టాయి. నల్లి తెగులు ఆశించి నిలువునా దెబ్బతీస్తోంది. బొబ్బ, జెమిని, ఆకుముడత తెగుళ్లు కూడా ఆశిస్తున్నాయి. నివారణకు ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం లేక పోతోంది. దీంతో పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ ఏడాది సీజన్ మొదలు కావడంతో ధర ఆశాజనకంగా ఉన్నా తెగుళ్లతో దిగుబడులు లేవని సాగుదారులు వాపోతున్నారు.

కష్టాల ‘సాగు’..

జిల్లాలో పచ్చి మిరప సాగు, ఉత్పత్తుల ఎగుమతిలో ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలోని రుద్రవరం, చాగలమర్రి, ఆళ్లగడ్డ మండలాలు అగ్రగామిగా నిలుస్తున్నాయి. గత ఏడాది నియోజకవర్గ వ్యాప్తంగా 6 వేల ఎకరాల్లో సాగుచేయగా ఈ ఏడాది సుమారు 8,500 ఎకరాల మేర సాగు అయినట్లు తెలుస్తోంది. గత ఏడాది సీజన్ ప్రారంభం దశలో ధరలు అధికంగా ఉండటంతో ఈ ఏడాది కూడా ఆశించిన ధర లభిస్తుందని ముందస్తుగా మిరప పంట సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపారు. ఆశించిన మేర వర్షాలు కురవక పోవడం, ఆకాశంలో ఎక్కువగా మబ్బులు కమ్ముకుని ఉండటంతో మిరప పంటను తెగుళ్లు దెబ్బతీస్తున్నాయి. చీడపీడల బెడద తీవ్రం కావడం.. సాయంత్రం రాత్రి వేళల్లో లద్దెపురుగు ఆకులను తినేస్తోంది. రసం పీల్చు, తామర, వేరు పురుగులు.. ఆకుముడత తెగుళ్లతో ఆకులు, కాండాలు దెబ్బతింటూ.. ఎదుగుదల క్షీణిస్తోంది. ఆకులు, పిందెలు రాలి రంగులోకి మారడంతో పూత, పిందె నిలిచిపోతోంది. లేత ఆకులు ముద్దకడుతున్నాయి. ఖరీదైన మందులు పిచికారీ చేసినా నివారణ సాధ్యం కాకపోవడంతో దిగుబడి గణనీయంగా తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆళ్లగడ్డలో ముందుగా ఉత్పత్తులు...

మిరపను నియోజకవర్గంలోని కొండకింది మండలాల్లో ఏటా ముందుగా సాగు చేస్తుంటారు. రాయలసీమ పరిధిలోనే మిరప ఉత్పత్తులను ముందుగా దేశంలోని వివిధ ప్రదేశాలకు ఎగుమతి చేసేది కూడా ఇక్కడి రైతులే కావడం విశేషం. మేలో నాటి సా గు చేయడంతో జులై నెలలోనే మిరప కాయ కోతలు మొదలు పెడతారు. దీంతో మార్కెట్ ఆశాజనకంగా ఉంటుందనేది రైతుల నమ్మకం. ఈ సంవత్సరం కూడా ఆదే ఆశతో సాగు చేసిన రైతులకు నష్టాలు తప్పటం లేదు.

నియోజకవర్గంలో మండలాలవారీగా మిరప సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)

ఆళ్లగడ్డ	1,400
రుద్రవరం	2,200
చాగలమర్రి	2,250
శిరివెళ్ల	800
ఉయ్యాలవాడ	1,000
దొర్నిపాడు	900

పంటను దున్నేయాలనుకున్నా



మిరప పంటకు ధర బాగా ఉంటుందని అందరు చెబుతుంటే ఈ ఏడాది 5 ఎకరాల్లో సాగు చేశాను. విత్తనాలు, సేద్యాలు, కూలీలు, నీళ్ల మందు, ఎరువులకు కలిపి ఎకరాకు రూ. లక్ష వరకు ఖర్చు వచ్చింది. 5 ఎకరాలకు రూ. 5 లక్షల వరకు ఖర్చు చేసినా కోతలు ప్రారంభించే లోపే తెగుళ్లతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. ఎన్ని మందులు కొట్టినా కంట్రోల్ కాలేదు. ఇక దున్నేయడమే మంచిదని ఆలోచిస్తున్నాం – సుబ్బ నరసయ్య , మిర్చి రైతు

పెట్టుబడులు కూడా రావు



నిరుడు ముందుగా వచ్చిన మిరపకాయలు మంచి ధర పలకడంతో ఈ ఏడాది కూడా ధర బాగుంటుందని నాకున్న రెండెకరాలతో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేశా. మొదట బాగానే ఉన్నా కాపుకొచ్చే సరికి విపరీతమైన తెగుళ్లు. ఇప్పటి వరకు మందులకే సుమారు రూ. 2 లక్షలు దాక ఖర్చు అయింది. 20 రోజుల్లోనే పంటంతా నాశనమైంది. పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదు. –బాలవెంకటసుబ్బయ్య, రైతు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న సీఐ దస్తగిరిబాబు

శిరివెళ్ల: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ దస్తగిరిబాబు అన్నారు. మంగళవారం యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాలు– దుష్పలితాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాల జోలికెళ్లితే బంగార భవిష్యత్ నాశనమవుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి విద్యార్థి మంచి లక్షణాలు అలవర్చుకోవడంతో పాటు బాగా చదువుకోవాలని సూచించారు. ఈవ్ టీజింగ్ జోలికి వెళ్లకుండా సీనియర్లు, జూనియర్లు అన్న దమ్ముళ్లగా మెలగాలన్నారు. డిగ్రీ అనంతరం పోటీ పరీక్షలు రాసి ఉన్నత ఉద్యోగాలు పొందాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): విద్యారంగానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జునైద్ బాషా, నంద్యాల జిల్లా కార్యదర్శి రాంబాబు విమర్శించారు. మంగళవారం పట్టణంలోని పద్మావతినగర్ సెంటర్‌లో విద్యార్థులతో కలిసి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పై నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో 40వేల ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, వాటిలో విద్యాబోధన సరిగ్గా లేక ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తుందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వ ప్రిన్సిపాళ్లు లేరన్నారు. జిల్లాలో ఇంటర్మీడియెట్ కార్యాలయాల్లో ఇన్‌చార్జ్‌ల పాలన కొనసాగుతుందన్నారు. రెగ్యులర్ అధికారులు కూడా లేరన్నారు. ఇదిలా ఉంటే ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారన్నారు. పలు విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలు, ప్రమాణాలు పాటించడం లేదని, వాటిపై సర్కారు ఎందుకో చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావడంతో పాటు రాష్ట్రంలో 6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు రమణ, నాగరాజు, షఫీ, తౌఫిక్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఈనెల 18వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను మంగళవారం ఆ ఫెడరేషన్ కార్యాలయంలో విడుదల చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం యువజన హామీలు అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. నేటికి కూడా ఏపీకి ఇచ్చిన విభజన హామీలు అమలు చేయలేదన్నారు. ప్రత్యేక హోదా ఇస్తామని, ఇంత వరకు పట్టించుకో లేదన్నారు. మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించే దిశగా కేంద్రం అడుగులు వేయడం సరికాదన్నారు. ఏపీ అంటే అమరావతి, పోలవరం కాదని, విభజన హామీలు కూడా ఉన్నాయన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు.కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు సాయి, అంజి, రమణ, సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మె మరింత ఉధృతం చేస్తాం



టీడీపీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ, మున్సిపల్ కార్మికులు

నంద్యాల(న్యూటౌన్): కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని నంద్యాల మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు బాలదుర్గన్న, సీఐటీయూ నాయకులు తోటమద్దులు లక్ష్మణ్, ఏసురత్నం హెచ్చరించారు మంగళవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయం, టీడీపీ కార్యాలయం ఎదుట సమ్మెలో భాగంగా ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టడంలో పట్టణంలో పలు వార్డుల్లో నీటి సమస్య, మరికొన్ని కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వానికి వినతులు అందజేసినా ఫలితం లేదన్నారు. జీవో నం.36 ప్రకారం కార్మికులకు రూ.21వేల నుంచి రూ.24,500 వరకు వేతనాలు పెంచి ఇవ్వాలన్నారు. పదవీ విరమణ వయస్సు 62ఏళ్లకు పెంచాలని, రిటైర్ అయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం , రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.75వేలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

గోస్పాడు: ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ వైద్యసిబ్బందిని ఆదేశించారు. మంగళవారం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని ఎంసీహెచ్ బ్లాక్‌లో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో జరిగే కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో వర్షాల కారణంగా అంటువ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందుతున్నాయని, ప్రతిఒక్క సూపర్‌వైజర్ అప్రమతంగా ఉండాలన్నారు. ఎక్కడ అయిన అంటువ్యాధులు ప్రబలితే వెంటనే సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, జిల్లా కేంద్రానికి సమాచారం అందించాలని సూచించారు. డీపీఓ నజీని మాట్లాడుతూ గర్భిణుల నమోదులో జిల్లా వెనుకబడి ఉందని చెప్పారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాంతరావునాయక్, జిల్లా టీబీ, లెప్రసీ అధికారిణి డాక్టర్ శారద బాయి, పీఎంకేవై అధికారి డాక్టర్ రూపేంద్రనాథ్ రెడ్డి, స్వర్ణాంధ్ర అధికారి డాక్టర్ ప్రసన్న లక్ష్మి, జిల్లా గణాంకా అధికారి సుజాత పాల్గొన్నారు.

పీ- 4పై గ్రామ సభలు ప్రారంభం

శిరివెళ్ల: మండలంలో పీ–4పై గ్రామ సభలు ప్రారంభమయ్యాయి. మంగళవారం గుంప్రమాన్‌దిన్నె, జీనేపల్లెలో సభలు నిర్వహించినట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తెలిపారు. 16న యర్రగుంట్ల, 17న శిరివెళ్ల, 18 గోవిందపల్లె, 22 చెన్నూరు, బోయలకుంట్ల, 23న గుండంపాడు, గంగవరం, 24 మహాదేవపురం, 25న కోటపాడులో సభలు ఉంటాయన్నారు. మండలంలో సర్వే ప్రకారం 1,327 కుటుంబాలకు ఆర్థిక, సేవా సహాయాలకు 147 మంది అధికారులు, ప్రజా ప్రతినిధులు, ధనవంతులు ముందుకు వచ్చారన్నారు.

కల్తీ విత్తనాలను అరికట్టాలి

నంద్యాల(అర్బన్): కల్తీ విత్తనాలను అరికట్టి రైతులకు నాణ్యమైనవి అందేలా చూడాలని నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు అధికారులను కోరారు. పట్టణంలోని నేషనల్ సీడ్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీలో జరుగుతున్న విత్తనశుద్ధిని మేనేజర్ మోహన్‌రాజ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొందరు నకిలీ విత్తనాలకు నంద్యాలను కేరాఫ్ అడ్రస్‌గా మారుస్తున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి వ్యవసాయాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

వేలిడేషన్ అమెండ్మెంట్ రద్దు చేయాలి

నంద్యాల(అర్బన్): పెన్షనర్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వేలిడేషన్ అమెండ్మెంట్‌ను రద్దు చేయాలని నంద్యాల జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పుల్లారెడ్డి, ప్రసాదరెడ్డి డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ పిలుపులో భాగంగా నంద్యాల జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట పెన్షనర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అన్ని బకాయిలు, డీఆర్‌లను తక్షణమే చెల్లించాలన్నారు. రైల్వే, విమాన టికెట్లలో సీనియర్ సిటీజన్ రాయతీలను అమల్లో తేవాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ శ్రీనివాసులుకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాలనాగిరెడ్డి, సుబ్బారెడ్డి, సుబ్బరాయుడు, జయప్రకాష్, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని జగజ్జననీ నగర్‌లో వెలసిన జగజ్జననీ మాతకు ఆషాడ మాసోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి ప్రతిమ, గండా దీపాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని మోకాళ్లపై గుడి ప్రాంగణంలో ప్రదక్షిణలు నిర్వహించారు. వీరికి దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

- పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో వెలసిన శ్రీకోదండ రామ స్వామి దేవస్థానంలో కాలనీ మహిళలు సీతమ్మ, పార్వతీ అమ్మవార్లకు పెద్ద ఎత్తున ఒడిబియ్యం, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అష్టాదళ పాదపద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): శ్రీకాశికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానంలో మంగళవారం ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం 108 వెండి పుష్పాలతో అమ్మవారికి అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. ఉదయం నుంచి భక్తులు మేళతాళాలతో సారెను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు

అర్హులందరికీ పంట రుణాలు ఇవ్వాలి

- బ్యాంకర్ల సమావేశంలో లీడ్‌బ్యాంక్ మేనేజర్ రవీందర్‌కుమార్

నంద్యాల: అర్హత కలిగిన రైతులు, కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ రవీందర్‌కుమార్ ఆదేశించారు. పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్‌లో గ్రామస్థాయి జన సురక్షణ కార్యక్రమం, కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై నంద్యాల నియోజకవర్గ బ్యాంకర్లతో జిల్లా అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు పాత ఖాతాలకు కేవైసీ కచ్చితంగా చేయించాలని, టీఎంజేజేబీవై, పీఎం ఎస్‌బీవై, ఏపీవై బీమా పథకాలతో అన్ని ఖాతాలను బ్యాంకర్లు నమోదు చేయాలన్నారు. నాబార్డు డీడీఎం కార్తీక్ మాట్లాడుతూ వ్యవసాయ క్లీనిక్‌లు, వ్యాపార కేంద్రాలు, కొత్త కోల్డ్ స్టోరేజీల నిర్మాణాలకు, ఉద్యాన , పాడిపరిశ్రమలకు విరివిరిగా రుణాలు అందజేయాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు బ్యాంకులు రుణాలు అందజేయాలన్నారు. సమావేశంలో విద్యుత్, నాబార్డు, డీఆర్‌డీఏ, బ్యాంకు మేనేజర్లు, వెలుగు, మెప్మా, అగ్రికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో త్వరితగతిన ప్రయోజనం



మాట్లాడుతున్న జడ్జి అమ్మన్నరాజ, రామచంద్రరావు, సాయిస్వరూప్

నంద్యాల(వ్యవసాయం): వివిధ కేసుల్లో మధ్యవర్తిత్వం చేయడం ద్వారా సమయం వృథాకాదని త్వరితగతిన ప్రయోజనం చేకూరుతుందని మండలం లీగల్ సెల్ చైర్మన్ మూడోఅదనపు జిల్లా జడ్జి అమ్మన్నరాజు పేర్కొన్నారు. మంగళవారం కోర్టు భవనంలో మీడియేషన్ ఫర్ ద నేషన్ కార్యక్రమంలో భాగంగా విలేకరులకు మధ్యవర్తిత్వం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి అమ్మన్న రాజా మాట్లాడుతూ మార్గదర్శకం వల్ల సామరస్య పూర్వకంగా కేసులను పరిష్కరించుకోవచ్చునన్నారు. ఈనెల 10వ తేది నుంచి 16వ తేది వరకు మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యవర్తిత్వంపై శిక్షణ పొందిన సీనియర్ న్యాయవాదులు రామచంద్రరావు, సాయి స్వరూప్‌లు ప్రింట్, ఎలక్ట్రానిక్ ప్రతినిధులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పత్రిక ప్రతినిధులు ద్వారకానాథ్, నరసింహులు, కుమార్, రాజశేఖర్, సాయి ఇమ్రాన్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయండి...

మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం వన్‌నేషన్–మీడియేషన్ కార్యక్రమం పై వన్‌కే వాక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మెడియేషన్ ప్రతినిధులు వెదుర్ల రామచంద్రరావు, సాయిస్వరూప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్జీలు, రిటైర్డ్ జడ్జీలు, న్యాయవాదులు, ఎన్జీవోస్, స్టేట్ హోల్డర్స్, న్యాయపరిరక్షణ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు

సమస్యల పరిష్కారానికి మధ్యవర్తిత్వమే మేలు

ఆళ్లగడ్డ: సమస్యల పరిష్కారానికి మధ్యవర్తిత్వమే మేలైన మార్గమని న్యాయమూర్తులు శైలజ, భాస్కర్ పేర్కొన్నారు. స్థానిక కోర్టు ప్రాగంణంలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యవర్తిత్వ న్యాయవాదులకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. దీన్ని ప్రారంభించిన న్యాయమూర్తులు మాట్లాడుతూ వాజ్యం ద్వారా కంటే మధ్యవర్తిత్వం ద్వారానే ఎక్కువ సంతృప్తి లభిస్తుందన్నారు. న్యాయవాదులంతా మధ్యవర్తిత్వంలో శిక్షణ తీసుకోవాలని సూచించారు.

జిల్లాలో 43వేలకు పైగా బంగారు కుటుంబాలు

గోస్పాడు: జిల్లాలో దారిద్ర్య రేఖకు దిగువనున్న 43,021 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు డీఎల్‌డీఓ శివారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్నారైలు, భూస్వాములు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీలు దత్తత తీసుకొని వారికి ఆర్థికంగా, విద్యాపరంగా, ఆరోగ్యపరంగా సహాయ సహకారాలు అందించాలన్నారు. మండల, గ్రామస్థాయి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దాలన్నారు. నేటి నుంచి గోస్పాడు మండలంలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ కౌన్సిల్ ఆఫీసర్, మండల్ స్పెషల్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజానికి కృషి చేయాలి

గోస్పాడు: పొగాకు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆర్ వెంకటరమణ అన్నారు. మంగళవారం నంద్యాలలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం నిర్వహించారు. పొగాకు వాడకంతో కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కాంతారావు నాయక్, నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చిన్న వీరన్న, సిబ్బంది పాల్గొన్నారు .

ప్రభుత్వం దృష్టికి ఆశా వర్కర్ల సమస్యలు

నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ ఆశాకార్యకర్తల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యల ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

కలెక్టరేట్ ఎదుట ముస్లిం జేఏసీ నిరసన

నంద్యాల(న్యూటౌన్): ఉర్దూ జూనియర్ కళాశాలను త్వరగా నిర్మించాలని కోరుతూ ముస్లిం జేఏసీ మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా ముస్లిం జేఏసీ కన్వీనర్ మౌలానా అబ్దుల్లా రషాదీ, గౌరవాధ్యక్షులు మహమ్మద్ అబులైజ్, అబ్దుల్ సమ్మద్ మాట్లాడుతూ ఆరు సంవత్సరాలుగా ఉర్దూ జూనియర్ కళాశాల నంద్యాలలో కొనసాగుతున్నా పక్కా భవనం నిర్మించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కేంద్ర ప్రభుత్వం నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా నేటికి పనులు ప్రారంభించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ముస్లిం జేఏసీ నాయకులు మౌలానా, రహమతుల్లా, కో కన్వీనర్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.